క్లుప్తంగా

ఘనంగా తిరునాల



కోలాటం ఆడుతున్న కళాకారులు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె శ్రీ ఆంజనేయస్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు చాందినీ బండ్లు ఊరేగింపు, చెక్కభజనలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కె. వెంకటరమణ, కె. వెంకటలక్ష్మమ్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రేపు ఆలయ భూముల వేలం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులోని దేవాదాయ శాఖ భూములను మూడేళ్ల పాటు కౌలుకు దేవాదాయశాఖాధికారులు శనివారం బహిరంగ వేలం పాట వేయనున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఏవో మునిరాజ, ఆలయ ధర్మకర్త ప్రకాష్‌రావు మాట్లాడుతూ కందుకూరులోని శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి, శ్రీ పట్టాభి రామాలయాలకు చెందిన మాన్యం భూములను కౌలు కోసం వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే రైతులు ముందస్తుగా రూ.5 వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు. గతంలో భూములు కౌలుకు తీసుకుని దేవాదాయ శాఖకు డబ్బు చెల్లించని రైతులు వేలంలో పాల్గొనరాదని వారు తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సాయిహితేష్

మదనపల్లె సిటీ: మదనపల్లె జూనియర్ కాలేజీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయిహితేష్ మాట్లాడుతూ ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 30వతేదీ వరకు తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, జాతీయవాదాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మహేష్‌రెడ్డి, అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఉపాధ్యాయులు విద్యాధరరావు, మధుకర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మదనపల్లె సిటీ: క్రీడలతో మానసికోల్లాసం పొందవచ్చని ఫుట్‌బాల్ క్యాంపు అసోసియేషన్ సెక్రటరీ మురళీధర్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపును మురళీధర్ ప్రారంభించారు. ఈ నెల 1 నుంచి 30 వరకు క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం, సాయంత్రం ఫుట్‌బాల్ క్రీడలో మెళుకువలు, ఆట నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌చార్జిగా మహేంద్రనాయక్ వ్యవహరిస్తారన్నారు.

పాఠశాలను కొనసాగించాలి

కలికిరి (వాల్మీకిపురం): పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా రద్దు కాబోతున్న చింతపర్తి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని చింతపర్తి ముస్లిం మహిళలు స్థానిక పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 25 సంవత్సరాల క్రితం ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన ఈ పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. పాఠశాల రద్దుతో 6, 7వ తరగతి విద్యార్థులు వాల్మీకిపురానికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాల కొనసాగే విధంగా చూడాలని కోరారు.

రక్తపరీక్షలు చేయించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ తదితరులు

మదనపల్లె: సికిల్ సెల్, అనీమియా రక్తపరీక్షలు 40 సంవత్సరాలు దాటిన ప్రజలందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ ప్రభాకర్ అన్నారు. గురువారం మదనపల్లె మండలములోని నక్కలదిన్నె తాండ, తుమ్మల తాండ, వేంపల్లిలో సికిల్ సెల్, అనీమియా నిర్మూలన మిషన్‌లో భాగంగా 104 వాహన సేవలకు హాజరైన ప్రజలకు మదనపల్లె డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో 104 వైద్యులు డాక్టర్ చరిత,ఎమ్. పి.హెచ్.ఎ. గంగయ్య పాల్గొన్నారు.

పురుగు పట్టని పంట కోసం..

పంట ఉత్పత్తిలో కీటకాల తెగుళ్ల వల్ల రైతులకెన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. పంట పండే లోపే తెగుళ్లబారిన పడి దిగుబడి లేక పెట్టుబడి కూడా నష్టపోతున్నారు. రసాయన ఎరువులతో తెగుళ్లను నివారించే పద్ధతి హానికరమైన ఫలితాన్నిస్తోంది. ఇలా పండించిన ఉత్పత్తులు విషపూరితమవుతున్నాయి. వీటిని వినియోగించేవారికే కాకుండా.. పర్యావరణ వ్యవస్థకు ఇవి హానీ కల్గిస్తున్నాయి. అందువల్ల కీటకాల నివారణకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. ఈ ఏడాది మామిడి, టమాటా పంటలకు ఆశిస్తున్న కీటకాలకు చెక్ పెట్టేందుకు కీటక నివారణ పద్ధతులను అవలంభిస్తున్నారు. ఇవి సత్ఫలితాలిస్తున్నాయి.

- ప్రయోగాత్మకంగా కీటక నివారణ కిట్ల వినియోగం
- తొలిసారిగా మామిడితోటల్లో ఏర్పాటు
- పురుగుల మందు వాడకుండా ప్రత్యామ్నాయం
- సత్ఫలితాలిస్తున్న ప్రయోగం



మామిడితోటలో ఏర్పాటు చేసిన క్రిమికీటక నివారణ కిట్లు

గుర్రంకొండ : రైతులు పంటలపై ఆవహించే కీటకాలు, పురుగులను నాశనం చేసేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టిన ఏర్పాట్లు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. రైతులు ఈ ఏడాది ప్రయోగాత్మకంగా మామిడితోటల్లో కీటక నివారణ కిట్లు ఏర్పాటు చేసుకొన్నారు. మార్కెట్లలో విక్రయించే కిట్లు కాకుండా రైతులు స్వయంగా కిట్లు తయారు చేసి మామిడి తోటల్లో ఏర్పాటు చేసుకొన్నారు. అందులోనూ వివిధ రంగుల్లో కిట్లు ఏర్పాటు చేయడంతో వీటకి పురుగులు ఆకర్షణ ఎక్కువగా ఉంటోంది. పురుగులు, కీటకాల నివారణ కోసం రసాయనిక మందులు వినియోగించకుండా ప్రత్యామ్నాయంగా కిట్లను ఏర్పాటు చేసి సఫలీకృతమవుతున్నారు.

తొలిసారిగా మామిడితోటల్లో..

మూడేళ్లుగా మామిడి తోటల్లో ఊజి, సన్నదోమలు దాడి చేసి పంట మొత్తం నాశనం చేశాయి. ఊజి దోమ కాటుతో కాయకు రంధ్రాలు పడిపోయి తోటల్లోనే రాలిపోతుంటాయి. దీంతో రైతులు చాలా వరకు నష్టపోయారు. వీటి నివారణ కోసం టమాటా తోటల్లో కొంతవరకు కీటక నివారణ కిట్లు మంచి ఫలితాలు ఇస్తుండడంతో ఈ ఏడాది తొలిసారిగా మామిడి రైతులు కూడా తమ తోటల్లో కీటక నివారణ కిట్లను ఏర్పాటు చేశారు. తోటలోని ప్రతి మామిడిచెట్టుకు ఒకటి రెండు చోట్ల కిట్లను ఏర్పాటు చేశారు. కిట్లలో సువాసన ఇచ్చే గుణం ఉండడంతో క్రిములు, కీటాకాలు, ఊజి దోమలు, ఆకుతొలిచే పురుగులు వీటిపై వాలి అందులో ఇరుక్కొని చనిపోతున్నాయి.

ఆకర్షణీయమైన రంగుల్లో..

మామిడి తోటల్లో ఏర్పాటు చేసుకొంటున్న కీటక నివారణ కిట్లు ఆకర్షణీయమైన రంగుల్లో ఉంటున్నాయి. టమాటా తోటల్లొ కేవలం పుసుపు రంగు కిట్లను మాత్రమే ఉపయోగిస్తున్నారు. అయితే మామిడితోటల్లో నీలం, పసుపు, తెలుపు రంగులతోపాటు పలు రకాల రంగులతో తయారు చేసిన కిట్లు మార్కెట్‌లోకి వచ్చాయి. మార్కెట్‌తో పాటు ఆర్బీకేల్లో కూడా ఈ రకం కిట్లు అందుబాటులో ఉంచారు. ఈ కిట్లకు క్రిమికీటాలు ఆకర్షించి చనిపోతున్నాయి.

పురుగుల మందులకు ప్రత్నామ్నాయంగా

పంటలపై ఆవహించే క్రిమి కీటకాలను నాశనం చేయడానికి ఎక్కువ శాతం రసాయనిక క్రిమి సంహారక మందులనే రైతులు వినియోగించేవారు. దీని ప్రభావం పంట దిగుబడులపై ఎక్కువగా ఉండేది. మూడేళ్లుగా కీటక నివారణ కిట్లు వినియోగించడంతో 50 శాతం మేరకు క్రిమికీటకాలు నాశనం అవుతున్నాయి. అందులోనూ ఈ ఏడాది తొలిసారిగా రైతులు మామిడితోటల్లోనూ వీటిని వినియోగించామని, దీని వల్ల కీటకాలను నివారించామని రైతులు అంటున్నారు.

తొలిసారి ఏర్పాటు చేశా



తొలిసారిగా మామిడితోటలో క్రిమికీటకాల నివారణ కిట్లు పెట్టాను. రెండు సంవత్సరాలుగా మామిడి తోటలు ఊజి, సన్నదోమలతో దెబ్బతిన్నాయి. దీంతో ఈ ఏడాది మామిడి చెట్లపై అక్కడక్కడా కిట్లను పెట్టాను. రంగురంగుల కిట్లను తోటలో ఏర్పాటు చేయడంతో పురుగులు, క్రిమికీటకాలు అందులో పడుతున్నాయి.

– నరసింహులు, కొత్తపల్లె

ఫలితాలు ఇస్తున్నాయి



టమాటా, మామిడితోటల్లో ఏర్పాటు చేసుకొంటున్న క్రిమి కీటకాల నివారణ కిట్లు కొంతమేరకు ఫలితాలను ఇస్తున్నాయి. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా మామిడితోటల్లో కూడా వీటిని ఏర్పాటు చేశాం. కిట్ల వినియోగంతో రసాయనిక క్రిమిసంహారక మందులు వినియోగం తగ్గుతుంది.

– పద్మావతమ్మ, దాచేవారిపల్లె

అగ్రిగోల్డ్ భూముల జోలికి వస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న సీఐడీ డీఎస్పీ కొండయ్యనాయుడు

కలకడ : మండలంలోని ఎవరైనా అగ్రిగోల్డ్ భూముల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని సీఐడీ డీఎస్పీ కొండయ్యనాయుడు హెచ్చరించారు. గురువారం కలకడ తహసీల్దార్ కార్యాలయంలో అగ్రిగోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులను డిప్యూటీ తహసీల్దార్ భార్గవిని అడిగి తెలుసుకున్నారు. కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె, గుడిబండ, కె.దొడ్డిపల్లె పంచాయతీలలో కలిపి మొత్తం 237ఎకరాల భూమిని రైతులు అగ్రిగోల్డ్ కంపెనీకి విక్రయించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో కొందరు విక్రయించిన భూములు తిరిగి ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏ బీవీ భాస్కర్, అగ్రివెల్ఫేర్ అసిస్టెంట్ రాధాక్రిష్ణ, సిబ్బంది రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలను ఉపాధి పనుల వైపు మళ్లించండి



మాట్లాడుతున్న ఏపీడీ మధుబాబు

గుర్రంకొండ: గ్రామాల్లో కూలీలను ఉపాధి హామీ పనులవైపు మళ్లించాలని ఏపీడీ మధుబాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు మందగించాయని పేర్కొన్నారు. కూలీలకు అవగాహన కల్పించి పనులకు వచ్చేలా చర్యలు తీసుకొనే బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిపై ఉందని చెప్పారు. పనులలో కూలీల సంఖ్య పెంచేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డి, ఈసీ సుబ్బరాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై సంబరాలు

మదనపల్లె : దేశవ్యాప్తంగా జనాభాలెక్కలతో పాటు కులగణనను చేపట్టాలని ప్రధాని మోదీ సర్కార్ తీసుకున్న కీలక నిర్ణయంపై బీజేపీ, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లె అన్నక్యాంటీన్ సమీపంలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు జబ్బల శ్రీనివాసులు, భువనేశ్వరి సత్య, బండి ఆనంద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రాబోయే జనాభా లెక్కలలో కులగణన చేర్చాలని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ప్రయోజనాలు కలుగుతాయని, రాజకీయాలకు అతీతంగా కులగణనకు అన్ని పార్టీలు, కులసంఘాలు, మేధావులు, విద్యావేత్తలు దీనికి సహకరించి మద్దతు ఇవ్వాలని కోరారు. అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే కులగణన సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మఠం కిరణ్, బాలకృష్ణ, శ్రీకాంత్, కిరణ్, సన, రాజన్న, నాగవేణి, చేనేత నాయకులు నాగరాజు, బీసీ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బీఎస్పీ విజయం

బీసీ కులగణన కోసం బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి చేసిన అనేక కార్యక్రమాలతోనే కేంద్రప్రభుత్వం కులగణన నిర్ణయం తీసుకుందని, ఇది బీఎస్పీ విజయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు.

సీహెచ్‌సీ స్థాయి పెంచేందుకు కృషి

కలికిరి: స్థానిక సీహెచ్‌సీని 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో కలికిరి సీహెచ్‌సీ 3వ స్థానం పొందడంపై సిబ్బందిని అభినందించారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలందిచాలని ఆదేశించారు. విశ్రాంత డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణారెడ్డి, వైద్యాధికారులు ఉదయ్‌కిరణ్, వెంకటేష్, సిమ్రాన్, అన్వేష్, వనజమ్మ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

పీలేరు రూరల్ : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలందించి పీలేరు ఆస్పత్రిని జిల్లాలోనే ఆదర్శ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని సూచించారు. వైద్యులు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో శివశంకర్, ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, ఎం. రెడ్డిబాషా, లడ్డూజాఫర్, శ్రీనాథరెడ్డి, షౌకత్‌అలి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అర్జున్ తపస్మాన్ ఘట్టం

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలో మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం అర్జున తపస్మాన్ ఘట్టం కన్నులపండువగా జరిగింది. బాలయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ రామయ్య 18 రోజులు పాటు ఏర్పాటు చేసిన మహాభారత యజ్ఞం స్థానిక శ్రీకామాక్షి సిద్ధేశ్వరస్వామి ఆలయ సమీపంలో నిర్వహించిన యజ్ఞంలో కళాకారులు అర్జున తపస్మాన్‌కు ఏర్పాటు చేసిన 18 మెటికలుకు ప్రతి మెటికకు ఒక పాట, ఒకపద్యం చెప్పడంతో ఎంతో ఆకట్టుకుంది. దాయాదులైన కౌరవులతో జూదం ఆడి ఓడిన పాండవులు అజ్ఞాతవాసం ముగిసిన తరువాత రాజ్యం కోసం కౌరవులతో యుద్ధం తప్పదని భావిస్తారు. ఇందులో భాగంగా అర్జునుడు వేషధారి ముందే సిద్ధంగా నాటి ఉంచిన తపస్మాన్‌పైకి ఒక్కో మెట్టు ఎక్కుతూ రాగయుక్తంగా పాట ఆలపిస్తూ తపస్మాన్ పైభాగానికి చేరుకుని అక్కడి నుంచి భక్తులపైకి మంత్రించిన నిమ్మకాయలు, విభూది తదితరాలు విసరడంతో నాటకం ముగిసింది. ఈ ఘట్టం నేత్రపర్వంగా సాగింది. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సంతానం కోసం, మొక్కుబడులు కోసం అనేక మంది తపస్మాన్ వద్ద వరపడ్డారు.



అర్జున తపస్మాన్ ఘట్టంలో పాల్గొన్న ప్రజలు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కలికిరి: వాయల్పాడు తాలూకా నూతన కమిటీ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో సంఘం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వాయల్పాడు తాలూకా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షుడిగా బి.నాగరాజ, ఉపాధ్యక్షుడిగా వి.రమణ నాయక్, గంగాధర్, ముజీబ్ బాషా, కార్యదర్శిగా జే.సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రాజమ్మ, ఎం.సందీప్, ఎం.భాగ్యలక్ష్మి, కోశాధికారిగా టి.సరోజమ్మ, మరో 17 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నష్టాల దోస

- దిగుబడి ఉన్నా ధర పతనం
- పంట కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- కొనేవారు లేక పొలంలోనే వదిలేసిన వైనం

పెద్దతిప్పసముద్రం: దోస సాగు చేసిన రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటకు ధర భారీగా పతనమవడంతో పెట్టుబడులు కూడా దక్కక అప్పులపాలవుతున్నారు. పంట సాగు చేసినప్పుడు ఉన్న ధర దిగుబడి వచ్చే సమయంలో అధఃపాతాళానికి పడిపోతోంది. మండలంలో వివిధ రకాల దోస పంటను సాగుచేసిన రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. కొనేవారు లేక పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. మండలంలోని మడుమూరుకు చెందిన ఆనంద్‌రెడ్డి అనే రైతు ఎనిమిది ఎకరాల్లో దోస పంటను సాగు చేశాడు. ఇటు జింకలు, అటు అడవి పందుల బెడదతో పాటు చీడ పీడల నివారణ చర్యలు చేపట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. ఒక్కో ఎకరాపై రూ.1.30 లక్షల చొప్పున మొత్తం ఎనిమిది ఎకరాలకు రూ.10 లక్షలకు పైగా పెట్టుబడిగా పెట్టాడు. పంట మంచి దిగుబడి రావడంతో రైతు ఎంతో సంబరపడ్డాడు. పంట కోత సమయంలో ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో వ్యాపారస్తులు కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు.



దోస కాయలను పొలంలోనే వదిలేసిన రైతు ఆనంద్‌రెడ్డి

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆఖరికి కిలో రెండు రూపాయలకు విక్రయిస్తామన్నా కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో కడుపు మండిన రైతు దోస కాయలను పొలంలోనే వదిలేశాడు. కనీసం పంటకు కాపలాగా ఉన్న కూలి డబ్బులు కూడా రాలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు మాట్లాడుతూ దోస పంట ఎకరా సాగు చేస్తే ఖర్చులన్నీ పోనూ రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చేదని తెలిపాడు. ఈ ఏడాది పెట్టుబడి కూడా రాలేదని వాపోయాడు. దోస పంటే కాకుండా టమాటా, పుచ్చకాయ, కీర దోస, బీర, మునగ, ఉల్లి పంటలను సాగు చేసిన రైతుల దుస్థితి ఇలాగే ఉంది. అప్పు తెచ్చి పంటను సాగు చేశారు. పెట్టుబడి కూడా దక్కకపోవడంతో కుమిలిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుని పంట నష్ట పరిహారం మంజూరు చేయాలని కోరుతున్నారు.

కార్మికులకు అండగా వైఎస్సార్‌టీయూసీ



మదనపల్లె : మేడే వేడుకల్లో పాల్గొన్న నిసార్‌అహ్మద్, బి.నరేష్‌కుమార్‌రెడ్డి



పీలేరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

- కార్మిక సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం
- సమన్వయకర్త నిసార్ అహ్మద్
- ఘనంగా మేడే వేడుకలు

మదనపల్లె : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (వైఎస్సార్‌టీయూసీ) కార్మికుల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. గురువారం ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్, నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమిప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని, సంక్షేమ పథకాలు, కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ కార్మికుల కోసం పనిచేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జూనియర్ సివిల్ జడ్జి జే.కీర్తన, లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జే.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు కూటమిప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.
- మేడేను పురస్కరించుకుని కురవంక వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పసుపులేటి చలపతి పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు, షూ, గ్లౌజులు పంపిణీ చేశారు.
- మేడే పోరాట స్ఫూర్తితో లేబర్ కోడ్ల రద్దుకు పోరాడుదామని, కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని, శ్రమజీవుల ఐక్యతతో సమస్యలు అధిగమిద్దామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వత్రి సురేష్‌కుమార్ అన్నారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట జెండాను ఎగురవేశారు.
- కార్మికవర్గం పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పనిదినం, అనేక హక్కులను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, మేడే స్ఫూర్తితో హక్కుల పునరుద్ధరణ కోసం కార్మిక, కర్షక మైత్రితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు.
- సివిల్ సప్లయిస్ సప్లై పాయింట్ వద్ద 139వ మేడే వేడుకలు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తోపుకృష్ణప్ప, పట్టణ కార్యదర్శి తిరుమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఐక్యతకు నిదర్శనం మే డే

బి.కొత్తకోట: ఐక్యతకు నిదర్శనం మే డే అని నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఉప కార్యదర్శి సలీంబాషా అన్నారు. మే డే సందర్భంగా గురువారం బి.కొత్తకోటలో కార్మిక సంఘాలు వేర్వేరుగా ఉత్సవాలు నిర్వహించారు. మే డే గురించి, కార్మిక పోరాటాలు, సాధించిన విజయాల గురించి నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, గఫూర్, బాలకృష్ణ, విమల, శివశంకర్, చౌడప్ప, సమీవుల్లా, షఫీ పాల్గొన్నారు. అలాగే సీపీఐ నాయకులు పీటీఎంరోడ్డులో జెండా ఎగురవేసి కార్మిక ఐక్యత నినాదాలు చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ రెడ్డి, బషీర్‌ఖాన్, తంబయ్యశెట్టి, అప్రషల్లీ, రఘునాథ్, నారాయణస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని ముందుకు నడిపేది కార్మిక శక్తే

కురబలకోట: ప్రపంచాన్ని ముందుకు నడిపేది కార్మిక శక్తేనని తహసీల్దారు తపస్విని అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు గురువారం మేడే వేడుకలను రెవెన్యూ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్మికులే సమాజ ప్రగతికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా మేడే చైతన్యానికి ప్రతీకగా నిలచిందన్నారు.

ఘనంగా మేడే

కలికిరి: స్థానిక గాంధీ కూడలిలో హమాలీల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా మేడే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటరమణ, ముస్తఫా, మహ్మద్ రఫీ, రెడ్డెప్ప, రవి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో..

పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కేకు కట్ చేసి, రోగులకు బ్రెడ్ అందచేశారు. సీహెచ్‌సీ సూపరిండెంట్ డా. పవన్ కుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో 139వ కార్మికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మదనపల్లె రోడ్డు బోడేషావలి దర్గా వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాడుతామన్నారు. చికాగోలో కార్మికుల పోరాట స్ఫూర్తితో ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా మేడే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే బహుజన సంక్షేమం సంఘం అధ్యక్షులు బలరాం ఆధ్వర్యంలో పీలేరు పట్టణంలో భవననిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ కార్మిక నాయకులు వెంకటరామయ్య, బి.వి. రమణ, ఓబులేసు, నాగార్జున, మస్తాన్ ఆధ్వర్యంలో మేడే దినోత్సవం నిర్వహించారు.

రామసముద్రం : మండలం కేంద్రంలో గురువారం 139 వ అంతర్జాతీయ మేడేను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, డివిజన్ కన్వీనర్ నాగప్ప మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. నాయకులు సహదేవయ్య, నారాయణ, ఎండపల్లి వెంకరమయ్య, కృష్ణప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మండలంలోని రాచవేటి వారి పల్లె పంచాయతీ దిగువ మాచి రెడ్డి గారి పల్లెలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శోభ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. స్థానిక చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ శ్రామికులతో కలిసి మేడే వేడుకలు జరుపుకున్నారు. కార్మికుల ఐక్యత కొనసాగాలంటే నినాదాలు చేశారు. ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.



బి.కొత్తకోట: మే డే వేడుకల్లో పాల్గొన్న నాయకులు



మదనపల్లె : పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పసుపులేటి చలపతి



కురబలకోటలో..